

హైదరాబాద్ వార్త

# బడికి వేళాయె

-ముగిసిన వేసవి సెలవులు
-నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పునఃప్రారంభం
-పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థుల్లో ఉత్సాహం
-స్టేషనరీ దుకాణాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు సందడి



**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:**
వేసవి సెలవులు ముగియడంతో నేటినుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఆయా విద్యాసంస్థల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తిచేస్తుండగా...ప్రభుత్వ పాఠశాలల్లో గతవారం రోజులుగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే తమ పిల్లలకు తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలు డ్రెస్సులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్టేషనరీ దుకాణాల్లో సందడి నెలకొంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు గోదాములకు చేరుకుంటున్నాయి. మూడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ఇంగ్లీష్‌మీడియం మొదటగా 1నుంచి 8వతరగతి వరకు అమలు చేశారు. ఆతర్వాత 9వతరగతి గతేడాది నుంచి 10వ తరగతి వరకు అమలు చేస్తున్నారు. అయితే చాలావరకు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదు. దాంతో కొన్నస్కూళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు తగిన విధంగా లేవు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందిస్తున్న విషయం తెలిసిందే. పాఠ్యపుస్తకాలను ఆయా స్కూళ్లకు పంపించినా యూనిఫామ్స్ విషయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. యూనిఫామ్‌లు కుట్టే పని ఇంకా పూర్తి కాలేదని తెలుస్తుంది.

**గ్రేటర్‌లోనే విద్యార్థులు ఎక్కువ ..**
గ్రేటర్ హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ జిలాలల్లో 2,550 ప్రభుత్వ, 4667 ప్రవేట్ పాఠశాలలు ఉన్నాయి. 2023-24 గణాంకాల ప్రకారం మూడు జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో 19.96లక్షల మంది, సర్కార్ బడుల్లో 3,49,787మంది చదువుతున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాతో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పదోతరగతిలో ఏటా ఉత్తీర్ణత శాతం తగ్గిపోతున్న పరిస్థితి కనిపిస్తుంది. సబ్జెక్ట్ టీచర్ల కొరత పాటు తెలుగు, ఇంగ్లీష్ సైతం బోధించే వారు కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

**ప్రవేట్ స్కూళ్లలో ఫీజుల బాదుడు ..**
ఈఏడాది ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు భారీగా పెంచారు. గతేడాదితో పోలిస్తే కొన్ని 50శాతం, మరికొన్ని 25శాతం పెంచాయి. కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి కూడా రూ.2లక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. ఒక స్థాయి ఉన్న పాఠశాలల్లో ఫీజుల 1.5లక్షల కంటే ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్కూళ్లలో ఫీజుల బాదుడు ఎక్కువగా ఉంది. పుస్తకాలు, యూనిఫాం పేరిట భారీగా వసూలు చేస్తున్నారు. బ్యాగులు, బెల్టులు, టైలు కూడా తమ వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు.

# అమ్మాయిల ఫోటోలు... అసభ్యకర పోస్టులు!

- రహస్యంగా తీసి మార్ఫింగ్ చేస్తున్న ఆకతాయిలు
- వ్యూస్, కామెంట్లతో పైశాచికానందాలు
- షీటీమ్స్, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువ



**హైదరాబాద్, జూన్11, ప్రభాతవార్త:**
రోడ్లపై వెళ్తున్న అమ్మాయిల ఫోటోలు రహస్యంగా తీసి ఆకతాయిలు పైశాచికానందాన్ని పొందుతున్నారు. అంతటితో ఆగకుండా మార్ఫింగ్ చేసి అర్ధనగ్నంగా నెట్‌లో అప్‌లోడ్ చేస్తూ మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వ్యూస్, కామెంట్లతో యువతులు, మహిళల జీవితాలతో ఆడుకుంటూ వ్యక్తిత్వాలను కించపరుస్తున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పలు షీటీమ్స్, పోలీస్‌స్టేషన్లలో ఇలాంటి ఫిర్యాదులు ఉన్నాయి. వారం రోజుల క్రితం అమీర్‌పేటలోని ఓ హాస్టల్ అమ్మాయి ఫోటో సోషల్‌మీడియాలో చూసి కంగుతింది. బంధువులు సైతం నిలదీయడంతో ఒకింత టెన్షన్ పడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో సికింద్రాబాద్‌లో నడుచుకుంటున్న యువతిని అసభ్య పోజిషన్‌లో తీయడంతో పోలీసులను ఆశ్రయించింది. ఇలా ఎందరో ఫోటోలు వారికి తెలియకుండానే వాట్సాప్,ఇన్‌స్టా,ఎక్స్ వేదిక,తదితర సోషల్‌మీడియాలో పోకిరిలు పోస్టు చేసి పిచ్చిగా కామెంట్లు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఒకప్పుడు సెలబ్రిటీలనూ టార్గెట్ చేసేవారు. వీరిని కట్టడి చేయకపోతే భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**వ్యూస్, కామెంట్లకై అసభ్యకర పోస్టులు...**
రెస్టారెంట్లు, పార్కులు, బస్టాప్‌లు, షాపింగ్ మాల్స్, చిన్నపాటి కిరాణా దుకాణాలకు వెళ్లిన అమ్మాయిలు జీన్స్‌ప్యాంట్ షర్ట్ ఉండి కొంచెం అందంగా కనిపిస్తే పోకిరిలు స్మార్ట్‌ఫోన్లతో వారి ఫోటోలు అక్రమంగా తీసి పైశాచికానందాన్ని పొందుతున్నారు. మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో అసభ్యకరమైన ట్యాగ్‌లైన్లతో అప్‌లోడ్ చేసి వ్యూస్, లైక్స్‌తో ఎంజాయ్ చేస్తున్నారు. యువతులకు తెలియకుండానే అనైతిక కలాపాలతో మనోవేధనకు గురవడమే కాకుండా పరువుకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. యువతులు, ప్రేమ జంటలు,మహిళలను సైతం దింపి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంట్లో కుటుంబసభ్యులకు ఇలాంటి వేధింపుల విషయాలు చెప్పలేక, పరువు కాపాడుకోలేక ఎంతోమంది సతమతమవుతున్నారు. కొంతమంది స్నేహితుల సహాయంతో పోలీసులను సంప్రదించగా..మరికొందరూ మాత్రం దిక్కుతోచని స్థితిలో కుమిలిపోతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి నిర్వాకాలు జరుగుతున్నాయనేది తెలుస్తుంది. అమీర్‌పేట, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, మియాపూర్, ఎల్‌బీనగర్‌తో పాటు తదితర ఏరియాలో ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయితే నెట్‌లో కనిపిస్తేనే అక్కడక్కడ బయటపడుతున్నాయి. ఇంకెన్నో అప్‌లోడ్ చేయకుండా ఆకతాయిలు దాచుకుంటున్నారనే డౌట్లు ఉంటున్నాయి. ఫోటోలు తీస్తున్నారనేది తెలిస్తే అప్పటి కప్పుడు తొలగించే అవకాశం ఉంటుంది. అలా నిలదీసిన గొడువలకు దిగుతూ అసభ్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు యువతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పోలీసులే స్వచ్ఛందంగా కాపాడాలని వినతులు..**
ఉద్యోగాలు, కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లకు ప్రిపర య్యేందుకు నగరానికి వచ్చి ఒంటరిగా ఉంటున్నారు. ఆకతాయిల నుంచి భద్రత చర్యలు తీసుకోవాల్సిన పోలీసులపైన ఎంతైన ఉంది. సీసీకెమెరాల ఫుటేజ్‌లతో ఆయా ప్రాంతాల్లో నిరంతరం పరిశీలించి పోకిరిలను అదుపులోకి తీసుకోవడంతో మరెవరు కూడా ఇలాంటి నిర్వాకాలు చేయకుండా నివారించవచ్చు. కొంత మంది అమ్మాయిలు, మహిళలు ధైర్యంగా ముందుకొచ్చిన అధికశాతం మాత్రం షీటీమ్స్, పోలీస్‌స్టేషన్లకు రావాడానికి నిరాకరిస్తారు. షీటీమ్స్‌లో ఫిర్యాదు రహస్యంగా ఉంటుందనే తెలిసిన ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్నట్లు తెలుస్తోంది. బస్టాప్, రైల్వేస్టేషన్‌లతో పాటు రద్దీ ప్రాంతాలు, కోచింగ్ కేంద్రాలల్లో నిఘాపెట్టాలని కోరుతున్నారు. తచ్చాడుతున్న పోకీరీలను గుర్తించి ఫోన్లను తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.

# బేగంపేటలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**బేగంపేట జూన్ 11,ప్రభాతవార్త**
అక్రమ నిర్మాణ దారులకు ఒక వైపు హైడ్రా,మరో వైపు జీహెచ్ఎంసీ అధికారులు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.వర్షాకాలం దృష్ట్యా నాలాల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా ఆధ్వర్యంలో మాన్సూన్ టీమ్స్ రంగంలోకి దిగి నాలాను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు.ఇటీవల కాలంలో బేగంపేట ప్యాట్నీ నాలాను ఆనుకుని ఉన్న రెండు అక్రమ భవనాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేసారు.బుధవారం తాజాగా బేగంపేట ప్రకాశం నగర్ వెల్కిన్ పార్కు ఎదురుగా నాలాను ఆనుకుని ఉన్న అక్రమ షెడ్లను జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నేలమట్టం చేసారు. మంగళవారం బేగంపేట లో హైడ్రా కమీషనర్ రంగనాథ్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కల్సి పర్యటించారు.అనంతరం బుధవారం ఈ ప్రాంతంలో సుమారు 600గజాల స్థలంలో ఉన్న షెడ్లను అధికారులు కూల్చివేసారు.ఈ షెడ్ల నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు నిర్వహించారు.ఇక్కడికి సమీపంలో కొన్ని నిర్మాణాలపై కోర్టు స్టేటస్‌కో ఉండటంతో అధికారులు వాటిని వదిలి వేసారు.బేగంపేట లో ఇటీవల జరుగుతున్న కూల్చివేతల నేపథ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో నాలాను ఆక్రమించిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.హైడ్రా,జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్న కూల్చివేతలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బేగంపేట వెల్కిన్‌పార్కు ఎదురుగా ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది.

# రంగంలోకి 'హైడ్రా 'మాన్‌సూన్ టీమ్స్

-జిహెచ్ఎంసి పర్యవేక్షణలోనే పూడిక తీసే పనులు -130 ఎమర్జెన్సీ బృందాలను సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:**
వర్షాకాలంలో నగరాన్ని వరద ముంచెత్తకుండా హైడ్రా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు 130 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ను సమాయత్తం చేస్తోంది. ఒక్కో టీంలో 12 మంది ఉంటారు. ఈ ఎమర్జెన్సీ బృందాలకు హైడ్రాకు చెందిన 51 డిఆర్‌ఎఫ్ బృందాలు కూడా తోడవుతున్నాయి. బిఆర్‌ఎఫ్ ఒక్కో బృందంలో 15 మంది చొప్పున ఉంటారు. ఈ రెండు బృందాలు సమన్వయంతో పని చేసేలా హైడ్రా అధికారులు దిశానిర్దేశం చేస్తారు. ఎక్కడ నీరు నిలుస్తోందో అక్కడ ఈ బృందాలు పనిచేస్తాయి. వరద ముప్పును తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. అలాగే నివాసప్రాంతాల్లో వరద నిలవకుండా చూస్తుంది

**పూడిక తీసే పని జిహెచ్ఎంసి పరిధిలోనే..**
వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసే బాధ్యతలను హైడ్రాకు అప్పగించిన విషయం విదితమే. ఈ క్రమంలో జిహెచ్ఎంసి పరిధిలో ఉండే మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాల విధుల పర్యవేక్షణ హైడ్రా పరిధిలోకి వచ్చింది.మురుగు కాలువల్లో చెత్త, పూడిక తీసే పనులు మాత్రం బల్దియా పరిధిలోనే కొనసాగుతాయి అని మున్సి పల్ శాఖ కార్యదర్శి వద్ద బుధవారం జరిగిన స మావేశం నిర్ణయించింది. ఎక్కడయినా అవసరం అంటేఆచోటులో హైడ్రా సహకరిస్తుందని తెలిపింది.



చింతల్‌బస్తీలో నాలాపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**చింతల బస్తీలో నాలా ఆక్రమణలను తొలగించిన హైడ్రా...**
నగరంలో నాల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం చింతల బస్తీలో నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వద్ద ఉన్న కల్వర్టుకు చింతల బస్తీ వైపు ఆక్రమణలు జరిగాయి. మొత్తం 15 మీటర్ల వెడల్పు కల్వర్టు కింద ఉండగా చింతలబస్తి వైపు 7 మీటర్ల మేర కబ్జా జరిగినట్టు నిర్ధారణకు వచ్చిన హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇసుక, చిన్న సిమెంట్ దుకాణంతో పాటు కల్లు కాంపౌండ్ రేకుల షెడ్డును తొలగించారు. పింఛను ఆఫీసు వద్ద ఉన్న కల్వర్టు ను పూర్తి స్థాయిలో హైడ్రా విస్తరిస్తోంది. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలై నాగులపల్లి, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, మేహిదీపట్నం, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, చింతలబస్తి, తుమ్మల బస్తీ మీదుగా హుస్సేన్ సాగర్ కలిసే చారిత్రక బుల్కాపూర్ నాలా సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది.

# జిహెచ్ఎంసి అధికారుల కొరడా..

-ఆర్టీసి క్రాస్‌రోడ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్ సీజ్




జిహెచ్ఎంసి అధికారులు సీజ్ చేసిన మాంగళ్య షాపింగ్ మాల్

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:**
ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. తనిఖీల్లో ఆ భవనంలో మాంగళ్య షాపింగ్ మాల్ అనుమతి లేకుండా కొనసాగుతోందని గుర్తించారు. ఆ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు జీహెచ్ఎంసీ సర్కిల్ 15 టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. ఈ బిల్డింగ్‌లో మూడు సెల్లార్స్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 5 ఫ్లోర్స్ లలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయంతో పాటు మల్టిప్లెక్స్ భవనంగా నిర్మితమవుతుంది. ఇక ఇదే భవనంలో 4, 5 అంతస్తులలో 'ఆర్ట్-7) స్క్రీన్ సినిమా హాల్ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. ఇలా ఈ భవనంలో నాలుగు ఐదు అంతస్తులలో 'ఈ ఏషియన్ (ఏఆర్‌టి) సినిమాస్ తో స్క్రీన్ ఏర్పాటు చేయబోతున్నట్లు కూడా తెలుస్తుంది. ఇప్పటికే మహేష్ బాబు, అల్లు అర్జున్ తో ఏసియన్ వారు భాగస్వామ్యం అయ్యారు. ఈ క్రమంలోనే మరో సీనియర్ నటుడితో కలిసి కూడా భాగస్వామ్యం కావడంతో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ లో ఉన్నటువంటి ఈ భవనంలో ఏఆర్టీ పేరుతో మల్టీప్లెక్స్ థియేటర్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఇంకా ఈ నిర్మాణ భవనం పూర్తి కాకుండా ఇప్పటికే షాపింగ్ మాల్స్ కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో జిహెచ్ఎంసి అధికారులు ఈ బిల్డింగ్ పై చర్యలు తీసుకొని సీజ్ చేసినట్టు సమాచారం. అయితే ఇదంతా కూడా ఒక బడా బిల్డర్ నిర్వహణతోనే జరుగుతోందని తెలుస్తోంది.

## రసరమ్యం శ్రీవారి పాదాలు అదితి భరతనాట్య ప్రదర్శన

**రవీంద్రభారతి, జూన్ 11 ప్రభాతవార్త :**
ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ శ్రీవారి పదాలు దశమ వార్షికోత్సవాల్లో భాగంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈరోజు రాత్రి అకాడమీ నిర్వాహకురాలు, ప్రముఖ నాట్యగురువు డా. రమాదేవి శిష్యురాలు అధితి సర్దా భరతనాట్య ఆరంగేట్రం సంప్రదాయబద్ధంగా ప్రేక్షకుల ప్ర శంసలందుకుంది. అధితి ముందుగా గంభీరనటై రాగం ఆదితాళంలో పుష్పాంజలి అంశంతో ప్రారంభించి, అలరిప్పు, జతిస్వరం, మాధవ పంచకం, అన్నమయ్య కీర్తన చక్కనితల్లికి చాంగుభళా, దశావతారం, జతిస్వరం, తిల్లానా తదితర అంశా లను శృతి లయబద్ధంగా హావభావాలను ప్రదర్శిస్తూ సభికులను మంత్రముగ్ధులను చేసింది. వాద్యసహకారంలో భాగంగా గురువు డా. ఎన్.రమాదేవి నట్టువాంగం, చంద్రరావు గాత్రం, చంద్రకాంత్ మృదంగం, ఉమా వెంకటేశ్వర్లు వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. చివరిగా అతిథులు కళాకారిణి అధితి, నాట్యగురువు డా. రమాదేవిలను ఘనంగా సత్కరించారు.



అధితి భరతనాట్య ప్రదర్శనలో ఒక దృశ్యం

# భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు

-బోనాలు,మోహరంకు పకడ్బందీ ఏర్పాట్లు
-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



లాల్‌దర్వాజ టెంపుల్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, జూన్11,ప్రభాతవార్త:**
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు.బోనాలు, మొహరం పండుగల సందర్భంగా బుధవారం ఆయన డబీర్ పుర, లాల్ దర్వాజ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని తెలిపారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు.భక్తులు కూడా పరిశుభ్రతను పాటించాలని, వ్యర్థాలు నిర్దేశించిన ప్రదేశాలలో పారవేయాలని కమిషనర్ భక్తులను కోరారు.కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ వెంకన్న డిసిఏఎంఅండ్‌హెచ్ ఓతదితరులు పాల్గొన్నారు.

## స్వీట్‌షాప్‌లపై జిహెచ్ఎంసి కొరడా

-నిబంధనలు పాటించుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:**
హైదరాబాద్ నగరంలో కల్తీ ఫుడ్, నాణ్యతలేని ఫుడ్ వల్ల ప్రజల ప్రాణాల మీదకు వస్తుంది. ఇష్టారీతిన హోటల్స్, రెస్టారెంట్లు, స్వీట్ షాపుల్లో కల్తీ కలకలం సృష్టిస్తోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే పలువురు ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు ఈ మధ్య హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిన్నటి వరకు రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పుడు స్వీట్ షాపుల్లో తనిఖీలు చేస్తున్నారు. జూన్ 11 నుంచి హైదరాబాద్ వ్యాప్తంగా పలు స్వీట్ షాప్స్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి. కర్ణన్ ఆదేశాలతో 29 స్వీట్ షాప్స్ లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్స్ పైర్ అయిన ఫుడ్ ఇంగ్రీడియంట్స్ వాడుతున్నట్లు గుర్తించారు. స్వీట్ షాపుల్లో అమ్మే వస్తువులకు ఎలాంటి లేబెల్, ఎక్స్ పైరీ డేట్ లేదని చెప్పారు. అలాగే కిచెన్ లో పని చేసే వారు హెడ్ కాప్స్, క్లౌజ్, యాప్రాన్స్ వేసుకోకుండా పనిచేస్తున్నారని కిచెన్‌లు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే సర్టిఫికెట్స్ ఎక్స్ పైర్ అయినా రెన్యువల్ చేయించుకోకుండా స్వీట్ షాప్స్ నిర్వహి స్తున్నారని ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని స్వీట్ షాపులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో ఎవరు తప్పు చేసినా వదిలే ప్రసక్తే లేదని ఇప్పటికే హెల్త్ మినిస్టర్ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. నాణ్యమైన ఫుడ్ అందించే వారికి అండగా ఉంటామని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. హోటల్స్, స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌తో పాటు హాస్టళ్లు, హాస్పిటల్స్, వర్క్ ప్లేసుల్లో ఉండే క్యాంటీన్లు కూడా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాల్సిందే అని స్పష్టం చేశారు.

# పండగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలకాలి

-తొలిరోజే అన్నిరకాల బుక్స్‌ను అందించాలి
-విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:**
పాఠశాలల పున ప్రారంభం సందర్భంగా పండగ వాతావరణం ఉండేలా ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ ఈవో,డిప్యూటీ ఐఓఎస్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి గురువారం నుంచి పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్న సందర్భంగా తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పున: ప్రారంభం రోజున విద్యార్థులందరికీ టెక్స్ బుక్స్,నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫార్మ్స్ కచ్చితంగా వంద శాతం అందజేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా పంపిణీ స్టాళ్లను అలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను పండగ వాతావరణంలో ప్రారంభించి తల్లిదండ్రులని పిల్లల్ని అందర్నీ ఆహ్వానించి ఒక వేడుకలా చేయాలని తెలిపారు.అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు తెలియపరచే ఎఫ్ఆర్ఎస్‌ను మొదటి రోజు నుంచే కచ్చితంగా ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో కొందరు ప్రధానోపాధ్యాయులు తమకున్న చిన్న చిన్న సమస్యలను తెలుపగా, సంబంధిత అధికారులను ఇట్టి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు పాఠశాలలను సందర్శించవలసిందిగా సర్కులర్ ఇవ్వడం జరిగిందని, గురువారం పాఠశాలల ప్రారంభం సందర్భంగా కచ్చితంగా రెండు మూడు పాఠశాలను సందర్శిస్తానని కలెక్టర్ తెలిపారు.ఈ జూమ్ మీటింగ్ లో జిల్లా విద్యాశాఖ అధికారిని ఆర్ రోహిణి, డిప్యూటీఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకస్మిక తనిఖీ



రసూల్‌పురాలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 8వవార్డు బొల్లారం అంబేద్కర్‌నగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. అనంతరం 2వ వార్డు రసూల్‌పురా నారాయణ జోపిడి లోని రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకస్మికంగా తనిఖి చేశారు. రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న తీరుపై ప్రజల అభిప్రాయలను తెలుసుకున్నారు. గత సర్కారు దొడ్డు బియ్యం పంపిణీ చేసిందని, అది తినలేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు సన్న బియ్యం పంపిణీ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఆర్థికంగా కూడా పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఎమ్మెల్యే తెలపారు.

## మంత్రి తుమ్మలను కలిసిన బండి రమేష్



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసిన బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త:** టిపిసిసి ఉపాధ్యక్షులుగా నియమితులైన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కష్టపడి పనిచేసి పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు రమేష్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, కూకట్పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య , శివ చౌదరి రమణ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూముల వేలం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయం : మాధవరం కాంతారావు



నిరసన తెలుపుతున్న కాంతారావు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త:** పేదలకు చెందాల్సిన కూకట్పల్లి హౌసింగ్ బోర్డు భూములను వేలం పాట పేరుతో అన్యాక్రాంతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేసిన నాయకులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి కేపిహెచ్బి స్టేషన్‌కు తరలించారు. కాగా విషయం తెలుసుకున్న కూకట్పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు అరెస్టైన పార్టీ శ్రేణులకు కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలకు చెందాల్సిన ప్రభుత్వ స్థలాలను వేలం పేరుతో కాంగ్రెస్ పార్టీ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు, ఎన్నికల్లో 420 హామీలను అమలు చేసేందుకు ఇలాంటి నీచ స్థితికి దిగజారిన రేవంత్ సర్కార్‌ను ప్రశ్నించేందుకు శాంతియుత నిరసన తెలుపుతున్న బిజెపి శ్రేణులను దౌర్జన్యంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ భూములను ఇందిరమ్మ ఇండ్లకు గానీ, కాలనీ ప్రజల సౌకర్యార్థం పార్క్‌లుగా గానీ తీర్చిదిద్దాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మధు గౌడ్, వినోద్ కుమార్ గౌడ్, గోపి, గురుప్రసాద్, తోట రమేష్, వెంకటరమణ, సత్యనారాయణ, రాములు, అనీల్, అనూష్, రేవతి, రేణుక, ఉన్నారు.

## పేదింటి అడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి వరం : కార్పొరేటర్



కళ్యాణలక్ష్మి చెక్కులను అందచేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి, జూన్ 11ప్రభాతవార్త:** పేదింటి ఆడ బిడ్డల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ పథకం వరం లాంటిదని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు.నాంపల్లి మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు డిప్యూటి తహాసిల్దార్ విశ్వేశ్వరరావుతో కలిసి కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ చెక్కులను అందచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి తల్లిదండ్రులకు ఎంతో ఊరట లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వివేక్‌కు హోంశాఖ కేటాయించాలి : బేర బాలకిషన్



మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ వివేక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అఫ్జల్‌గంజ్, జూన్ 11ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ జి. వివేక్‌కు తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి పదవిని కేటాయించాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక అధ్యక్షులుబేరా బాలకిషన్ అన్నారు.ఈమేరకు మంత్రి డాక్టర్ వివేక్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు.

**ఇ.ఎన్.టి.ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఆనందాచార్యకు సన్మానం**

**బేగంబజార్, జూన్ 11ప్రభాతవార్త:** ఇ.ఎన్.టి ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఆనందాచార్య జన్మదినవేడుకలను ఆసుపత్రి ఘనంగా నిర్వహించారు.ఈమేరకు ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఆనందాచార్యను ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ అనిల్ కుమార్,టిఎన్‌జిఓ యూనిట్ అధ్యక్షులు తూముకుంటరాజు,కార్యదర్శి బాస్కర్,కోశాధికారి రవి,హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి,ఆఫీసు సూపరింటెంటెంట్ సునీల్,నర్సింగ్ అధికారి అనురాధ,ఫార్మాసిస్టు శ్రీహరి,శ్రీనివాస్,ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానం విప్లవాత్మక దిశగా ముందుకు సాగుతోంది

**-ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్**



ప్రసంగిస్తున్న ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** దేశంలో జాతీయ విద్యా విధానం కొత్త ఆవిష్కరణలతో విప్లవాత్మక దిశగా ముందుకు సాగుతోందని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 అనేది భారత విద్యా రంగంలో ఒక విప్లవాత్మక దశగా అభివృద్ధి చెందిందని, అందులో భాగంగా ఐడీపీ అనేది ప్రతి విద్యాసంస్థకు ఒక దిశానిర్దేశక పథకంగా ఉపయోగపడేలా రూపొందించబడినదని వివరించారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక ద్వారా విద్యాసంస్థలు తమ బలాబలాలు, అవకాశాలు, మార్గసూచక లక్ష్యాలను గుర్తించి, విద్యా నాణ్యతను మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంస్థ స్వయం విశ్లేషణ ద్వారా తాము ఎక్కడ ఉన్నామో తెలుసుకోవడం, ఎటు పోవాలో నిర్ణయించుకోవడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ధ్యేయాలు – మానవ సామర్థ్యాన్ని వెలికితీయడం, సమానత్వం, న్యాయసమాజం నిర్మాణం, అత్యుత్తమ బోధనా విధానాలు, విద్యలో లౌకికత – అన్నీ ఈ విధానంలో ప్రతిబింబించాల్సిన అంశాలుగా ఆయన చర్చించారు . ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యా సంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి,డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణు ప్రియ, ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపల్స్,టీచింగ్ ఫాకల్టీ పాల్గొన్నారు.

## అవినీతిపరులను వదిలే ప్రసక్తే లేదు : మహేష్ కుమార్ గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాగభూషణం, లక్ష్మణ్‌యాదవ్, యాదగిరిగౌడ్, కృష్ణగౌడ్, నిరంజన్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపరులను వదిలే ప్రసక్తే లేదని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈమేరకు టీపిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన నాగభూషణం బుధవారం మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగభూషణం ను మహేష్ కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం నాగభూషణం ఎంతో కష్టపడి పనిచేశారని పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికలలో అంబర్ పేట్ నియోజకవర్గ ఇన్చార్జిగా అనేక సేవలందించారని తెలిపారు. నాగభూషణం సేవలు పార్టీకి అవసరమని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు . అనంతరం నాగభూషణం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ యాదవ్, లక్పతి యాదగిరి గౌడ్ , కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, మాజీ కార్పొరేటర్ నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడను అభివృద్ధిలో జిల్లాలోనే నెంబర్ వన్‌గా మారుస్తాం

**- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

**- రూ.72.కోట్ల 9.లక్షల పనులకు శంఖుస్థాపన**



బండ్లగూడ కార్పోరేషన్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను అభివృద్ధిలో రంగారెడ్డి జిల్లాలోనే నెంబర్ వన్‌గా మారుస్తామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని 1,2,3,5,6,7,13,14.డివిజన్ల పరిధుల్లో రూ.72 కోట్ల 9.లక్షల పనులకు కమిషనర్ బి.శరత్ చంద్ర, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలిచ్చిన అధికారంతో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నానని వివరించారు. నాయకుడన్న వాడు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించాలని, అప్పుడే ప్రజలు వెన్నంటి ఉండి ఎన్నికల్లో ఓట్లు వేసి ప్రజా ప్రతినిధిగా గెలిపించుకుంటారన్నారు. కేవలం ఎన్నికల ముందు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి, ఓట్లు వేయమని అడిగితే పక్కన పెడుతారని, ఇప్పటి ఓటర్లు చాలా తెలివైన వారని, పని చేసే వారికే పట్టం కడుతారని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, వారి ఇబ్బందులు దూరం చేస్తున్నందే నన్ను నాలుగోసారి అసెంబ్లీకి పంపారని వివరించారు. రాజేంద్రనగర్ ప్రజల రుణంను తీర్చుకునేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. మౌళిక వసతులైన భూగర్భ డ్రైనేజి, మంచినీటి పైప్‌లైన్ పనులు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల వంటి ఏర్పాటుకు తొలి ప్రాధాన్యతను ఇస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, ఎ.బ్లాక్ అధ్యక్షులు నవీన్, మాజీ కార్పోరేటర్‌లు బి.సాగర్ గౌడ్, క్యాతం పద్మావతి పాపయ్య యాదవ్, శ్రీనాథ్‌రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు రాంప్రసాద్, విష్ణు, లక్ష్మణ్, అంక రవి, నరేష్, సుమన్‌గౌడ్, గణేష్, హరీష్‌గౌడ్, సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన జగదీశ్వర్‌గౌడ్



**శేరిలింగంపల్లి, జూన్11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యున్నతి కోసం పునరంకితమై పనిచేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశకుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ..టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ శేరిలింగంపల్లి నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్రవాయప్తంగా ఉన్న కార్యకర్తలు, నా యకులను కలుపుకుంటూ పార్టీ పటిష్టతకు పనిచేస్తాన ని,పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రా ష్ట్రాభివృద్ధికోసం కష్టపడిపనిచేస్తానన్నారు. పార్టీ పురోగతి కోసం అలుపులేకుండా పనిచేసేలా ఉత్సాహం నింపిన కాంగ్రెస్ పార్టీ అధిష్టాన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇద్దరు నకిలీ డాక్టర్‌లపై కేసు నమోదు

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** అర్హతలు లేకున్నా అక్రమంగా క్లీనిక్ నడుపుతూ పేషెంట్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లపై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్‌లోని బంధన్ ఫంక్షన్‌హాల్ దగ్గర న్యూ ఆల్ షిఫా పేరుతో నుజాత్ సుల్తానా, సాద్ సైఫుద్దీన్ అనే ఇద్దరు ఎటువంటి మెడికల్ సర్టిఫికెట్లు లేకుండా క్లీనిక్ ప్రారంభించి, డాక్టర్లుగా వైద్యం చేస్తున్నారు. ఒక్కో పేషెంట్ వద్ద నుండి 100, 150 రూపాయల చొప్పున కన్సల్టేషన్ ఫీజు తీసుకుంటూ ప్రిస్క్రిప్షన్ పై ఏవో మందులు రాసి ఇస్తూ పేషెంట్లను మోసం చేస్తూ ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ముషీరాబాద్ పోలీసులు క్లీనిక్‌పై దాడి చేసి, విచారించగా, నుజాత్ సుల్తానా యునానీ లో మెడిసిన్ పూర్తి చేసింది కానీ అల్లోపతి డాక్టర్‌గా ఎటువంటి లైసెన్స్, సర్టిఫికెట్, అర్హత లేకుండా గైనకాలజిస్ట్‌గా వైద్యం చేస్తోం దని తేలింది. డబ్బు కోసం పేషెంట్ల జీవితాలను ప్రమాదంలోకి నెట్టి, అక్రమంగా క్లీనిక్ నడుపుతున్న ఆమెను అరెస్ట్ చేసి, క్లీనిక్‌ను, క్లీనిక్ లో ఉన్న క్లీనికల్ ఐటమ్స్‌ను సీజ్ చేశామని, మరో డాక్టర్ గా చెలామణి అవుతున్న సైఫుద్దీన్ పరారీలో ఉండటంతో అతని కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ఆటోరిక్షాలకు పర్మిట్‌లు ఇవ్వడంతో హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 65 వేల ఆటోరిక్షాలకు సిఎం రేవంత్‌రెడ్డి పర్మిట్‌లు జారీ చేసి ఉత్తర్వులు విడుదల చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి హర్షం వ్యక్తం చేసింది. బుధవారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, నాయకులు అశోక్, జంగయ్య, వి.ప్రవీణ్, లింగం, వి.మారయ్య, మహేష్, శ్రీకాంత్, అజయ్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అనేక ఆందోళనలు చేసిన పిదప రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలలో భాగంగా కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు జారిరి అనుమతి ఇవ్వడం హర్షణియమన్నారు. మిగతా ప్రధాన డిమాండ్లు 100 శాతం పెరిగిన ఇంధన చార్జీలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ప్రతి ఏడాది 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, ఆటో రవాణా రంగ సంక్షేమానికి ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కోట నీలిమకు అభినందనల వెల్లువ



**బేగంపేట జూన్ 11,ప్రభాతవార్త :** టీపీసీసీ వైస్ ప్రెశిడెంట్‌గా నియమితులైన సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమను సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు కోట నీలిమ నివాసంలో కల్సి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా త్రికాల మనోజ్‌కుమార్ కోట నీలిమను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలియజేసారు.కోట నీలిమను కల్సి అభినందనలు తెలియజేసిన వారిలో బచ్చు రాజ్‌కుమార్, హేమంత్ సింగ్ ఠాగూర్,తదితరులు పాల్గొన్నారు.

## అండర్-15లో రవికుమార్ అద్భుత ప్రదర్శన

**-మాన్‌సూన్ రెగట్టా పోటీలు**



పోటీల్లో గెలుపొందిన సెయిలర్ రవికుమార్

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టాలో లోకల్ సెయిలర్ బన్నేవోలు రవి కుమార్ సత్తా చాటుతున్నాడు. అండర్ -15 ఆప్టిమిస్ట్ ఫ్లీట్‌లో తన స్థిరమైన ప్రదర్శనను కొనసాగిస్తూ బుధవారం జరిగిన రేసులో విజయం సాధించి పతకం సాధించే దిశగా దూసుకెళ్తున్నాడు. రసూల్‌పురాలోని ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న రవి రేసును అద్భుతంగా ప్రారంభించి ఆరో స్థానానికి పడిపోయినప్పటికీ నగరంలోని తారా హోమ్‌కు చెందిన అనాథ నవీన్.ఎంను అధిగమించాడు. అండర్ 15 విభాగం బాలికల్లో శ్రేయ కృష్ణ (తమిళనాడు) ఒక రేసులో 9వ స్థానానికి పడిపోయినప్పటికీ పుంజుకుని చివరి రేసులో గెలిచి గణనీయమైన తేడాతో అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ అమ్మాయి లాహిరి కొమరవెల్లి రెండో స్థానంలో ఉంది. అబ్బాయిల్లో తెలంగాణ కుర్రాడు రిజ్వాన్ మొహమ్మద్ స్వర్ణం దిశగా దూసుకెళ్తున్నాడు. అండర్ 19, 40 క్లాస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన తనుజశ్రావణ్, దీక్షిత గణేష్ జంటలు తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ, రజత పతకాలు దాదాపుగా ఖాయం చేసుకున్నారు. ఎన్ఎస్ఎస్ భోపాల్‌కు చెందిన సమృద్ధిపార్థ్ జంట కాంస్య పతకంపై పట్టు సాధించింది. అండర్ 15 విభాగం గ్రీన్ ఫ్లీట్‌లో హర్యానాకు చెందిన ఇద్దరు యువ సెయిలర్లు ఆయు, సాక్షి ఆధిపత్యం చెలాయి స్తూ పతకాలు సాధించే దిశగా పయనిస్తున్నారు. సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన ఇషి గుప్తా, తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్‌కు చెందిన సాక్షి మండల్ ఉన్నారు. అండర్ 18 లేజ ర్ క్లాస్‌లో నేవీ యూత్ సెయిలింగ్ టీమ్‌కు చెందిన శరణ్య జాదవ్, రమాకాంత్ ఫ్లీట్‌లో ఆధిక్యంలో ఉన్నారు.

## రెవెన్యూ అధికారులు పాతిన బోర్డులు తొలగించిన కబ్జాదారులు

**- కబ్జాదారులకే పరోక్ష మద్దతు ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది**



మణికొండ సర్వే నెంబర్ 261.లోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు పాతిన బోర్డులు తీసి స్మశాన వాటికలో వేసిన కబ్జాదారులు

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** గండిపేట మండలం మణికొండ గ్రామ సర్వే నెంబర్ 261.లోని స్థలం ప్రభుత్వానికి చెందినదని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పేరుపై పాతిన బోర్డులను కబ్జాదారులు తొలగించారు. ఈ బోర్డులను తొలగించి స్మశాన వాటికలో ఓ మూలన పడేశారు. నిత్యం ఇదే ప్రాంతంలో తిరుగుతున్న రెవెన్యూ సిబ్బంది ఈ విషయంను చూసినా చూడనట్లు నటిస్తున్నారు. వీరు కబ్జాదారులతో చేతులు కలిపి పరోక్షంగా వారికే మద్దతు ఇస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న కబ్జాల విషయం గాని, కలెక్టర్ పేరుపై పాతిన బోర్డులు తొలగించిన విషయంను గాని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడం లేదు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకే ఉద్యోగంలో చేరిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఊదాసీనంగా వ్యవహరిస్తుండడం వలన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారుల వశం అవుతుంది. దీనికి ముమ్మాటికి రెవెన్యూ అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంది. 261.సర్వే నెంబర్‌లో 2006.సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పేదలకు 60.గజాల పట్టాలను 278.ఇచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం ఎవరికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. కానీ స్థానికంగా ఉన్న కొంత మంది రాజకీయ నాయకులు తమ అనుచరగణంతో డూప్లికేట్ 60.గజాల పట్టాలు తయారు చేయించి, కబ్జాలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఇక్కడ 500. వరకు ఇళ్లు కట్టారు. ఇంత భారీ ఎత్తున దొంగ పట్టాలు తయారు చేసి, కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని మాయం చేస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుండడం గమనార్హం. కబ్జాదారులు ఇచ్చే కాసులకు రెవెన్యూ యంత్రాంగం కక్కుర్తి పడడం వల్లనే ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు దర్జాగా కబ్జాలు చేసేస్తున్నారని, ఇళ్లు కట్టేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. మణికొండలో ప్రభుత్వ భూమి కరిగిపోతుండడంను గమనిస్తుంటే "కంచే చేను మేసిన చందంగా" మారిందని వయోజనులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రభుత్వ భూమిని కాపాడడం వారి ఉద్యోగం, కానీ ఆ పనిని మొక్కుబడిగా చేస్తూ, పక్క నుంచి వచ్చే అక్రమ సంపాదనకు ఇక్కడి రెవెన్యూ యంత్రాంగం అలవాటు పడ్డారని, అందుకే సర్వే నెంబర్ 261.లో ఇంత దర్జాగా కబ్జాదారులు సర్కారు భూమిని స్వాహా చేసేస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మణికొండలో జరుగుతున్న కబ్జాల తతంగంపై స్పందించాలని, విధుల పట్ల ఊదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని మణికొండ గ్రామస్థులు కోరుతున్నారు.

**తహసీల్దార్ వివరణ :**

మణికొండ సర్వే నెంబర్ 261.లో ప్రభుత్వ భూమి అని పెట్టిన బోర్డులను తొలగించిన విషయంను ప్రభాతవార్త గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ బోర్డులు తొలగించిన వారిని గుర్తించి, క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మంత్రివర్గంలో వివేక్ వెంకటస్వామికి చోటు లభించడం హర్షణీయం : చిరంజీవి



మంత్రివర్గంలో స్థానంపొందిన వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న వల్లభనేని ప్రసాద్, టి.చిరంజీవి, వి.భారతి తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి స్థానం కల్పించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఫర్ డీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని ప్రసాద్, అడ్మిన్ ఇంటర్‌ప్రిటర్ వి.భారతి, డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేశ్ గౌడ్ వెల్లడించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వివేక్‌వెంకటస్వామిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పదిహేను నెలలుగా ఎదురుచూస్తున్న తమ కళ చివరకు సాకారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ వర్గాలకు వివేక్‌వెంకటస్వామి నాయకత్వంలో న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## సమాజాన్ని ప్రతిబింబించే నాటకాలను బతికించుకోవాలి

**-ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం**



కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** సమాజాన్ని ప్రతిబించించే నాటకాలను బతికించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సింధు కళాసంధ్య సాంస్కృతిక సేవా నిలయం అధినేత, ప్రముఖ గాయకుడు రవి ఆధ్వర్యంలో 'కళాకదంబం' కార్యక్రమంలో భాగంగా 'ప్రేమ రుతువు నాటిక' ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు శ్రోతలను అలరించింది. నిర్వాహకుడు, గాయకుడు రవి నటులు రవి వర్మ వేక్షణలో తొలుత తెలుగు హిందీ సినీసంగీత విభావరి, అనంతరం నాటక ప్రదర్శన, చివరగా స్వల్ప విడివిలో శాస్త్రీయ నృత్యరూపక ప్రదర్శన ఆకట్టుకునేలా జరిగాయి. ఈ కార్యక్రమంలో సత్కళాభారతి అధినేత సత్యనారాయణ, కార్యక్రమంలో సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హను మంతరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సంగనభట్ల నరసయ్య, జరుగుల రామారావు, మాదవి, పూజిత, కార్తీక్, జశ్వంత్‌రాణా, బుర్రా మోహనకృష్ణ శివరమ్య, పద్మావతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. లాస్య కూచిపూడి స్కూల్ ఆధ్వర్యంలో రోహిణి ప్రసాద్ బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రోహిణి ప్రసాద్ 'వెంకటేశ్వర వైభవం-శ్రీ మార్కండేయ చరిత్ర' అంశంపై నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది.

## కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే తలసాని



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ పండితులు

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:** బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను జరుపుతున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఎల్లమ్మ ఆలయ అధికారులు వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి జులై 1 వ తేదీన అమ్మవారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేస్తూ లేఖను అందజేశారు. ముందుగా ఆలయ పండితులు ఎమ్మెల్యేను వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించే అమ్మవారి కళ్యాణాన్ని తిలకించేందుకు నగరం నుండే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి కూడా పెద్ద సంఖ్యలో వస్తారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 14వ తేదీన ఉదయం 10.00 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా గౌడ్, నివీ కృష్ణ తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 11 ప్రభాతవార్త:** ప్రజా ఆకాంక్ష మేరకు అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళుతున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాయల్ ఎన్‌క్లేవ్‌లో 49లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలో 90శాతం డ్రైనేజీ పనులను పూర్తి చేశామని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. సిసి రోడ్డు ఏర్పాటు ద్వారా రాక పోకలకు ఇకపై ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, దిడ్ల స్వామి, నవీన్, కొండల్ రెడ్డి, విష్ణు, వెంకటేష్ గౌడ్, దేవ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఒక గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని దోమలగూడ పెట్రోలింగ్ పోలీసులు ఫుట్‌పాథ్‌పై గుర్తించారు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల ఎనిమిదవ తేదీ రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్ క్రింద, అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఆ వ్యక్తి గురించి అక్కడ స్థానికులను విచారించగా ఆ వ్యక్తి ఎవరో తెలియదని, అక్కడే భిక్షాటన చేస్తూ ఉండేవాడని తెలియటంతో మృతదేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించి, మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీకి బండి రమేష్ బలం, బలగం : మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



బండి రమేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ బలం, బలగం అని ఏ బ్లాక్ ఉప అధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ నియమితులైన ఆయన నివాసంలో ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాధిరెడ్డి యుగంధర్ రెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడే తత్వం ఉన్న బండి రమేష్‌కి ఉపాధ్యక్షుడు నియమించడం చాలా సంతోశకరమైన విషయమని హర్షం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేవిధంగా ఆయన కృషి చేస్తారని తనకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందీగా బాల నర్సింహా, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్, బాలానగర్ డివిజన్ ఉపాధ్యక్షులు మాదరి శ్రీనివాస్, ముప్పురి బాలరాజు, వాహజ్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు చెక్కులు అందజేత



లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట, జూన్ 11 ప్రభావార్తః**
కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల ను లబ్దిదారులకు ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదవాళ్లందరికి అందుతాయని, ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మార్వో పాండు నాయక్ పాల్గొన్నారు

# స్మశావాటిక అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నేతలు

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్తః**
న్యూ బోయినపల్లి చిన్నతోకట్ట స్మశాన వాటికలో కనీస సదుపాయాలు కల్పించేందుకు తనవంతుగా ఆర్థిక సహకారం అందించనున్నట్లు కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి తెలిపారు. జిఎం అంజయ్య స్మారక హిందూ స్మశాన వాటిక కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైనా కేశవరెడ్డి మాట్లాడుతూ సదా కుటుంభం. మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్ధన్ రెడ్డి కుటుంభం తరపున స్మశాన వాటికలో వివిధ మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. తన వంతుగా ఐదు లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. దశలవారీగా డబ్బులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బోయినపల్లి ఎస్సై ఎల్.రాజు తన వంతుగా సహకారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి. జంపన ప్రతాప్, బాణుక మల్లికార్జున. స్థానిక నాయకులు ముప్పిడి మధుకర్. డైమ్అశోక్. స్మశాన వాటిక కమిటీ సభ్యులు, జిఎం అంజయ్య మెమోరియల్ హిందూ స్మశాన వాటిక అధ్యక్షులు ఏ కొండల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏ విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు వేయాలని వినతి



జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సిపార్సు లేఖను అందజేస్తున్న సంతోష్ యాదవ్

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్తః**
సికింద్రాబాద్ 150 డివిజన్‌లోని కుమ్మరి గూడ నుంచి శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి టెంపుల్ వరకూ సిసి రోడ్డు వేయాల్సిందిగా కోరుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ జోనల్ కమీషన్‌కు రాసిన రిప్రజెంటేషన్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతోష్ యాదవ్ నార్త్ జోన్ కమీషనర్ రవికి రణ్‌కు అందజేశారు.శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సమీపంలోనే ఉన్న నేపధ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని సరైన రోడ్డు లేకపోవడం తో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగు తుందని, వెంటనే ఈ ప్రాంతంలో సిసి రోడ్డు వేయించాల్సిందిగా సంతోష్ యాదవ్ కోరారు.

## అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల ప్రారంభోత్సవం



గోశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతనంగా నిర్మించిన గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు మన సంప్రదాయానికి, ఆధ్యాత్మికతకు, వ్యవసాయానికి ప్రాణాధారం అన్నారు. ఇటువంటి గోశాలలు సమాజానికి పెద్ద వరంగా నిలుస్తాయ నీ పౌరులందరూ గోవును సంరక్షి చే దిశగా ముందుకు రావాలనీ, గోశాలలు మన పాఠశాలలవలె, మానవతా విలువలను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. గోవు సంరక్షణ మన ధర్మం, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుందని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి గ్రామంలో కూడా జరుగాలని తెలియజేశారు. గోపూజ, గోవుల అర్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించి, గోశాల నిర్వాహకులను రాజేశ్వరరావు అభినందించి గోవులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వాటిని సంరక్షించాలన్నారు.

## 27 కులాలను తెలంగాణ వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చవద్దు : డాక్టర్ రఘు



వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దేశబోయిన రఘు తదితరులు

**సికింద్రాబాద్, జూన్ 11 ప్రభాతవార్తః**
ఆంధ్రప్రదేశ్‌లో నివసించే 27 కులాలను తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల జాబితాలో ఎట్టి పరిస్థితిలో తిరిగి చేర్చవద్దని, చేర్చితి నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెచ్చుకున్న తెలంగాణ వృథా అవుతుందని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది డాక్టర్ దేశబోయిన రఘు తెలిపారు. ఈనెల 9,10,11 తేదీలలో వెనుకబడిన తరగతుల కమిషన్ బహిరంగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో కమిషన్‌కు ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో జీవో నెంబర్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేలో నివసించే 27 వెనుకబడిన తరగతుల కులాలను తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల జాబితాలోంచి తొలగించిందన్నారు. తొలగించిన 27 వెనుకబడిన తరగతుల కులాల వారు హైకోర్టుని ఆశ్రయించగా వారి పిటిషన్ డిస్మిస్ చేస్తూ హైకోర్టు తెలంగాణ ప్రభుత్వా నిర్ణయాన్ని సమర్థించిందన్నారు. ఆ 27 కులాల వారు సుప్రీంకోర్టుని ఆశ్రయించారని, సుప్రీంకోర్టు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించి తమ తమ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు సమర్పించవలసిందిగా ఆర్డర్ జారీ చేసిందని, సుప్రింకోర్టు ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల కమిషన్ జూన్ 9, 10, 11 తేదీలలో బహిరంగ విచారణ చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం తరపున తన వాదనలు వెనుకబడిన తరగతుల కమిషన్ ముందు వినిపించినట్లు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకుంది నీళ్ల, నిధులు, నియామకాల కోసమని, తెలంగాణ ఉద్యమంలో దాదాపుగా 1200 మందికి పైగా వెనుకబడిన తరగతులు పిల్లలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఆంధ్ర ప్రాంతానికి సంబంధించినటువంటి 27 కులాలను తెలంగాణ వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చితే తెలంగాణ ప్రాంత వెనుకబడిన తరగతుల పిల్లలు విద్యలో ఉపాధిలో తమ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు డాక్టర్ అక్కపల్లి ఉదయ్ కిరణ్, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు దామెర సదానంద్ గంగపుత్ర, స్థానిక సంఘం గౌరవ అధ్యక్షుడు కర్మకొండ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూలో గ్లోబల్ ఇండస్ట్రీ ట్రెండ్స్ అంశంపై సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న ప్రముఖులు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
కూకట్పల్లిలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ అపార్చునిటీస్, మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ గ్లోబల్ ఇండస్ట్రీ ట్రెండ్స్ అంశంపై బుధవారం జేఎన్టీయూలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆదరణీయ ఉపకులపతి డా.టి.కె.కె. రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐటీ రంగంలో వేగంగా మారిపోతున్న కారియర్‌లు, కోర్ ఇంజినీరింగ్‌లో ఉన్న స్థిరత మధ్య తేడాలను విశదీకరించారు. ప్రారంభంలో ఉన్నాకే ఆకర్షణీయ వేతనాలు ఇచ్చే ఐటీ రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వలన శీఘ్రంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఓ ప్రముఖ సంస్థలో ఏఐ టీమ్ తాము రూపొందించిన టెక్నాలజీ వలనే ఉద్యోగాలు కోల్పోయిన ఉదాహరణను ప్రస్తావించారు. మెకానికల్, సివిల్, పెట్రోలియం వంటి కోర్ ఇంజినీరింగ్ శాఖల్లో మూడు నాలుగు సంవత్సరాల అనుభవం తర్వాత, ఉద్యోగుల స్థానభద్రత, నైపుణ్య విలువ మరింత పెరుగుతుందని వివరించారు. సమీపంలో ఉన్న ఓ పెట్రోలియంప్లాంట్ డిజైన్ సంస్థ ఐదుగురు ఉద్యోగుల నుండి ఐదేళ్లలో 800 మందికి పెరిగిన ఉదాహరణను ఇచ్చారు. విద్యార్థుల అభివృద్ధికి ఆ సంస్థ విస్తృతంగా సిఎస్ ఆర్ కార్యకలాపాల ద్వారా మద్దతు ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. బాలునాయక్, డా.పి. భ్రమర, డా.ఈ. రామ్జీ, ఎం.టి. నాయిక్, డా.ఎం. ఇందిరారాణి, డా. ఎస్. నాగ సరదా తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం నవీన్ మున్నంగికి వారి విలువైన సాహిత్యం, పరిశోధనా మేళవింపుతో విద్యార్థులను స్ఫూర్తివంతంగా ప్రేరేపించినందుకు కృతజ్ఞతలు తెలిపింది.

### రోడ్డు పనులు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ కోలరు వీరేందర్ రెడ్డి

**నిజాంపేట్, జూన్ 11, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఐడియా బొల్లారం ప్రధాన రోడ్డు గుంతలమయం కాగా వచ్చేది వర్షాకాలం కనుక వాహనదారులకు ప్రజలకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలని, మాజీ కార్పొరేటర్ కోలరు వీరేందర్ రెడ్డి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి దాదాపు 50 లక్షల రోడ్డు వర్క్ శాంక్షన్ చేపించి బుధవారం దగ్గర ఉండి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ రోడ్డు పనికి సహకరించిన ఎన్ఎంసి కమిషనర్‌కు, అధికారులకు మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ అరుణ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కోలన్ జీవన్ రెడ్డి, 18వ డివిజన్ అధ్యక్షులు రాజేందర్, యూత్ ప్రెసిడెంట్ జిత్తు తదితరులు పాల్గొన్నారు.

## రవిశేఖర్ రెడ్డి సేవా కార్యక్రమాలు అభినందనీయం : మల్లు రవి



రవిశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న పిసిసి క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్తః**
రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి చేస్తున్న సేవా కార్య క్రమాలు అభినందనీయమని తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్, పీసీసీ క్రమశిక్షన సంఘం ఛైర్మన్ డాక్టర్ మల్లు రవి కొనియాడారు. బుధవారం రవిశేఖర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ లోని డాక్టర్ మల్లురవి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా డాక్టర్ రవి శేఖర్ రెడ్డి చేస్తున్న పార్టీ కార్యక్రమాలను, సేవా కార్యక్రమాలను సామాజిక మాధ్యమాలలో చూస్తున్నానని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ఆ సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ చేరువ చేసే విధంగా కృషి చేయాలని సూచించారు.

## మహాకవి విశ్వంభరుడు సినారె వద్ద పనిచేయడం అదృష్టమే
**: మాజీమంత్రి, ప్రముఖ హాస్యనటుడు పి.బాబుమోహన్**



ఉత్తమసేవా పురస్కారగ్రహీతలతో బాబుమోహన్, నరసింహారెడ్డి, మల్లెకేడిరాములు, రాందాసుతేజావత్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 11 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత మహాకవి, విశ్వంభరుడు డా. సి.నారాయణరెడ్డి దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసి ఆ భక్తిభావంతో మహనుభావుడి పేరిట సినారె కళాపీఠం సాహిత్య కళా సేవాసంస్థను స్థాపించి కళా సాహిత్యసేవలను అందించడం అదృష్టం భాగ్యమని ప్రముఖ సినీ హాస్యనటుడు, మాజీ మంత్రి పి.బాబుమోహన్ అన్నారు. తనను సినీరంగంలో ఉత్తముడిగా తీర్చిదిద్దడం, సినారెతో ఉన్న మమతానుబంధాన్ని, ఉత్తముడిగా తీర్చిదిద్దిన వైనాన్ని గుర్తుతెచ్చుకున్నారు. మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో, సంస్థ అధ్యక్షుడు మల్లెకేడా రాములు నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖకవి డా. ఏనుగు నరసింహారెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.బాబుమోహన్ గౌరవ అతిథులు అడిషనల్ డిసిపి ట్రాఫిక్ రాందాసు తేజావత్, దాసరి దయానంద్‌రెడ్డి, ఎస్.సుచరిత, డిఎన్. పవిత్ర, అపర్ణా కళ్యాణి, డి.సుధాకర్‌రావు, డా. పోరెడ్డి రంగయ్య, కవిత, శ్రీధర్, టిఎస్.రావు, నర్సయ్య, బాలరాజు, సుమిత్ర, సాయికృష్ణ తదితరులతో కలిసి టిజిఎస్ ఆర్టీసీ సికిందరాబాద్ రీజియన్ పరిధిలో ప్రమాదరహిత సేవలు అందించిన డ్రైవర్లు 11మందిని ఘనంగా సత్కరించి వారి విశిష్ట సేవలకు గుర్తింపు, ప్రోత్సాహకంగా ఉత్తమసేవా పురస్కారం–2025 ప్రదానంచేసి శుభాభినందనలు అందజేసి వారి ప్రజాసేవను ప్రశంసించారు.

# వ్యభిచారగృహంపై పోలీసుల దాడి
**- నిర్వాహకుడితో పాటు యువతులు, విటులు అరెస్ట్**

**హైదరాబాద్,జూన్11, ప్రభాతవార్తః** గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై బంజారాహిల్స్‌పోలీసులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్సు టీం బుధవారం దాడులు దాడులు జరిపింది. నిర్వాహకుడితో పాటు యువతులు, విటులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.26500 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ యాదేందర్ తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్‌లోని కుమ్మెట నరేందర్‌రెడ్డి (30) ఓ ఇంటిని అద్దెకు తీసుకవచ్చి గత కొంతకాలంగా వ్యభిచారగృహన్ని నిర్వహిస్తున్నాడు. యువతులు, మహిళలను తీసుకవచ్చి విటుల నుంచి రూ.4వేల నుంచి 5వేల వరకు వసూలూ చేసి పంపిస్తున్నాడు. సెక్స్ వర్కర్లకు నెలవారీగా జీతాలు ఇస్తూ నడిపిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేయడంతో కలాపాలు వెలుగులోకి వచ్చాయి. వ్యభిచారగృహం సిబ్బంది ఆనంద్ కుమార్, రాహుల్‌కుమార్‌లతో పాటు విటులు అయాన్ కోడిశ్వరన్, ఉష్కేల్కర్ శ్రీనివాస్, నరేందర్‌కుమార్, యువతులు, మహిళలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సహకార సంఘాల సమాఖ్య ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్తా
### -రాష్ట్ర వ్యవసాయక శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వినతి పత్రాన్ని అందజేస్తున్న సహకార సంఘాల సమాఖ్య ప్రతినిధి బృందం

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మోతే భాస్కర్‌రెడ్డి, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గోపాల మల్లారెడ్డి తదితరులు బుధవారం నాడిక్కడ మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి తోడ్పటు అందిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య (పిఎసిఎస్) ఉద్యోగుల సమస్యలు గత 12 సంవత్సరాలుగా పరిష్కారించకుండా ప్రభుత్వం ఉందని, పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలని, ప్రతి నెల 5వ తేదీన డిసిసిబి బ్యాంకు ద్వారా జీతభత్యాలు చెల్లించాలని, గ్రాద్యుటి రెండు లక్షల కాకుండా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ డిసిసిబి ద్వారా భవిష్య నిధి చెల్లించి, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే 2019 తరువాత సంఘంలో చేరిన ప్రతి ఉద్యోగికి జివొ నెంబరు 44ను అమలు చేయాలని, 25 శాతం బ్యాంకు నియామకాల్లో ఏలింటి పరీక్షలు లేకుండా సినియారిటీ ఆధారంగా పిఎసిఎస్ ఉద్యోగులను ఎంపిక చేసి బ్యాంకుల్లోకి తీసుకోవాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పందిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డికి సమస్యలను తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### లులు మాల్‌లో లైవ్ బాక్సింగ్ పోటీలు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
హైదరాబాద్ నగరంలో లైవ్ బాక్సింగ్ పోటీలు జరగబోతున్నాయి. నగర ప్రజల కోసం కూకట్ పల్లిలోని లులు మాల్ యూఐసీతో కలిసి లులు యూఐసీ ఫైట్ నైట్2 ఈ పోటీలను నిర్వహించనుంది. హైదరాబాద్ నగరంలో మాల్‌లో ఇలాంటి పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ నెల 13, 14, 15వ తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. తొలి రోజు ఫేస్ ఆఫ్, రెండో రోజు కిక్ బాక్సింగ్, మూడో రోజు మువతాయ్ పోటీలు జరుగుతాయి. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఇవి జరగనున్నాయి. ఈ ఈవెంట్‌లో దేశ వ్యాప్తంగా 36 మంది బాక్సర్లు పాల్గొననున్నారు. ఆరుగురు రిఫరీలుగా వ్యవహరిస్తారు. ఈ పోటీలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సైతం హాజరుకానున్నారు. ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎమ్మెల్సీ కవితతో పాటు హీరోలు సుమన్, నితిన్ సైతం రానున్నారు. మాల్ ప్రాంగణంలోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ వెల్లడించారు.


**IN THE DEBT'S RECOVERY TRIBUNAL-II, 1st Floor, TRIVENI COMPLEX, ABIDS, AT:: HYDERABAD**

**T.A. No. 5 OF 2024**

**Between:**
**BANK OF MAHARASHTRA, Safilguda Branch, Hyderabad, T.S. Rep. by its Branch Manager and principal officer ...APPLICANT**
**AND**
**SRI. NARAYANAN VIJAY GOPAL, S/o.Late. Kuppaswamy Narayanan Iyyengar, aged about 51 years, occ: Employee, R/o. H.No. 8-43/28/3/7, Street No. 4, Srinivasa Nagar Colony, East Balaji Hills, Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District, Telangana State. ...Defendant**

**SUMMONS**

Whereas the applicant has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993, against you for the recovery of a sum of **Rs.1,79,87,363/- (Rupees One Crore Seventy Nine lakhs Eighty Seven thousand Three hundred and sixty three only)** together with current and future interest and other relief's. You are hereby required to show cause on **14-07-2025 at 10.30 a.m.,** in the forenoon in person or by a Pleader / Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the application will be heard and determined in your absence.

**Registrar**
**Debts Recovery Tribunal - II**
**Hyderabad.**

**IN THE DEBT'S RECOVERY TRIBUNAL-II, 1st Floor, TRIVENI COMPLEX, ABIDS, AT:: HYDERABAD**

**O.A. No. 54 OF 2025**

**Between:**
**BANK OF MAHARASHTRA,** a Body corporate in India constituted under the Banking Companies (Acquisition and Transfer of Undertakings) Act, 1970 having its Head Office at Lokmangal, 1501, Shivajinagar, Pune-411005 and carrying a banking business among the other places interalia at Safilguda Branch, Hyderabad, T.S. Rep. by its Branch Manager and Authorized Officer ...Applicant Bank
**AND**
**M/s. LAXMI DURGA WINES** Represented by its Proprietor Sri. J. Saidulu Goud, H.No. 3-4-105/B, Main road, Street No. 8, Ramanthapur, Hyderabad-500047, Telangana State.
**SRI. J. SAIDULU GOUD,** R/o. Plot No. 402, Shilpa Residency, Street No. 8, Habsiguda, Hyderabad - 500007, Telangana State.
**SMT. J. PADMA** W/o. Sri J. Saidulu Goud, R/o. Plot No. 402, Shilpa Residency, Street No. 8, Habsiguda, Hyderabad - 500007, Telangana State. ...Defendants

**SUMMONS**

Whereas the applicant has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993, against you for the recovery of a sum of **Rs. 30,26,567.27/-(Rupees Thirty lakhs twenty six thousand five hundred and sixty seven and paise twenty seven only)** together with current and future interest and other relief's. You are hereby required to show cause on **08-07-2025 at 10.30 a.m.,** in the forenoon in person or by a Pleader / Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the application will be heard and determined in your absence

**Registrar**
**Debts Recovery Tribunal - II**
**Hyderabad.**

**In the Court of the Hon'ble II Addl Junior Civil Judge Medchal-Malkajgiri District AT :: KushaiGuda**
**O.S.NO. 398 OF 2025**

Between:
**GARIKAMOKKALA SREENIVASULU & OTHERS**
Rep. by their own brother (the GPA) & The Plaintiff No. 6.
**RAMESH GARIKAMOKKALA ...Plaintiffs**
AND
**The MRO Malkajgiri Mandal** Medchal-Malkajgiri District **& All the Concerned. ...Defendants**

TO
**ALL THE CONCERNED**
Whereas the Plaintiffs above have filed the above suit for declaration of legal heirs of their parents namely late. G V. Laxman Rao who died on 09.06.2001 and Late G. Rukmini Bai who died on 17.10.2012. Anyone having any objection has to appear either in person or through his/her advocate with defenseif any on **25-06-2025 at 10:30 am** before the above said Court. Failing which the suit will be heard and determined ex-parte and orders pass as per law.
//BY THE ORDER OF THE HON'BLE II Additional Junior Civil Judge, Medchal-Malkajgiri District, At: KushaiGuda//

**M/S: NAJMA BEGUM & ADVOCATES ASSOCIATES,**
Office at H.No: 9-8-412/A, Opposite Post Office, Golconda, Hyderabad-8,
**Cell No: 9391418835.**

**PUBLIC NOTICE**

The General public is hereby invited to take notice that my client **Smt. Ratnaparkhee Madhavi,** W/o. Ratnaparkhee Praveen Kumar, Aged about 45 years, Occ: Household, R/o. H.No. 4-6-101/2, Rambagh, Attapur, Rajendranagar. R.R District is owner of the property situated at Narapally vide original sale deed Document No. 3336/2011 registered in the records of SRO, Narapally and represented to me that she has lost the original sale deed bearing No.4771/2000 along with link document No.939/1999 while she was travelling into Himayathnagar to Attapur on 25.04.2025, there after she gave a self publication and police report no use for that, than she approached me for publication. Hence I hereby notify the said loss of document by my client and demand the one amongst others who may so ever if found the said document to contact the undersigned forthwith not later than one week from the date of this publication, failing to receive any call it would be construed that the document is lost forever and appropriate legal measures would be taken for recovery of the document.

**Akella Subba Lakshmi, Advocate**
Flat No.202, A.N. Misra Apartments, Street No.14, Himayath Nagar, Hyderabad-500 029, **Cell No.90325 11755**

**PUBLIC NOTICE**

It is hereby informed to all the General Public that my client **SRI KARNAKOTI RAKESH,** S/o Late K. Shivaji had lost his Original Registered Gift Deed Dated 28.01.2022 bearing Document No. 883/2022, Original Registered Sale Deed Dated 25.01.2019 bearing Document No. 752/2019 and Registered Gift Deed bearing Document No.5573/2010 when he came to Hyderabad from Kodada in RTC Bus on 07.06.2025. My client had also given complaint to the Police, L.B. Nagar Police to take necessary action.
If any person or persons finds the said Original Registered Gift Deed Dated 28.01.2022 bearing Document No. 883/2022, Original Registered Sale Deed Dated 25.01.2019 bearing Document No. 752/2019 and Registered Gift Deed bearing Document No. 5573/2010 the same may be handed over to the undersigned as a lawabiding citizen. Further, the above said original document shall not be abused or misused or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not bind my client.
Hence this Public Notice.

**Sd/- Y. RAMI REDDY, Advocate,**
#Flat No.308, Arun Residency, Bairamalaguda, L.B. Nagar, Ranga Reddy District.
**Cell: 9849174405**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPLE DISTRICT JUDGE, SANGAREDDY DISTRICT, AT: SANGAREDDY**
**TR. OP. No. 7 of 2024**

BETWEEN:
**Smt. P. Anuradha ...Petitioner**
AND
**Smt. Manda Sarojini & Others ...Respondents**

**NOTICE**

To:
**Sri Dhana Teja Developers Pvt. Ltd.** Rep. by its Managing Director Sri. B. Ashok S/o. Subba Naidu, Aged about 59 years Occ: Business Office at 301, Peace Villa Apartments, Jafar Ali Bhagh Somajiguda, Hyderabad. **...Respondent No.3**
Please take notice that the above named petitioner filed the above said case for transfer OP against the respondents which is posted on **02.07.2025** for your appearance, therefore you are hereby advised to appear before the above said Hon'ble court on **02.07.2025 at 10.30 AM** either in person or through an Advocate, failing which the matter will be decided exparte.
(BY ORDER OF THE COURT)

**Sd/- N. Bojjaiah (Ganesh)**
**J. Venkatesh**
**Advocates,**
H.No.11-3-253, Rd No.6 Advocates Venkateshwara Colony, Saroor Nagar, Hyderabad-35,
**Ph.No.8096979391**
**Counsel for the Petitioner**

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT ERRAGADDA, HYDERABAD (SOUTH).**
**DISPUTE NO. GL001 OF 2025**

BETWEEN:
**M/S PMBS CHIT FUND PRIVATE LIMITED. ...Disputant**
Vs.
**Mrs. E. Vara Lakshmi & OTHERS ...Opponents**

To
**1. Smt. E. Vara Lakshmi,** W/o. Late Sri. E. Shyam Sunder, Aged about Major, R/o. H.No. 12-2-668/A/1, Mandulguda, Gudimalkapur, Vegitable Market, Mehidipatnem, Hyderabad.
**2. Sri. Shiva Kumar,** S/o. Late Sri. E. Shyam Sunder, Aged about Major, R/o. H.No.12-2-668/A/1, Mandulguda, Gudimalkapur, Vegitable Market, Mehidipatnem, Hyderabad.
**3. Sri. E. Naveen Kumar,** Late Sri. E. Shyam Sunder, Aged about Major, R/o. H.No.12-2-668/A/1, Mandulguda, Gudimalkapur, Vegitable Market, Mehidipatnem, Hyderabad.
**4. E. Mahesh Kumar,** Late Sri. E. Shyam Sunder, Aged about Major, R/o. H.No.12-2-668/A/1, Mandulguda, Gudimalkapur, Vegitable Market, Mehidipatnem, Hyderabad.
**...OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.5,40,479/-.** The above claim petition is posted to dated **08-07-2025** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00 A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**Smt. B. Sandhya Naga Padma, Advocate,**
H.No.8-3-115/A & B, L.B. Towers, Keshava Nagar, Srinagar Colony Road, Hyderabad-500 163

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT ERRAGADDA, HYDERABAD (SOUTH).**
**DISPUTE NO. GL003 OF 2025**

BETWEEN:
**M/S PMBS CHIT FUND PRIVATE LIMITED. ...Disputant**
Vs.
**Mr. J.Y. Sudhakar Babu & Others ...Opponents**

**1. Sri. J. Y. Sudhakar Babu,** S/o. J.N. Yadagiri, Aged about Major, R/o. H.No. 3-6-348/44, Chandra Nagar, Basheerbagh, Hyderabad-29.
**2. Sri. F. Srinivas,** S/o. F.Shanker Rao, Aged about Major, R/o. H.No.3-16-106/14/15/3, Venkat Reddy Nagar, Ramanthapur, Hyderabad-13.
**3. Sri. J. Naveen,** S/o. J. Balaraj Goud, Aged about Major, R/o. H.No.11-5-92/1/A, Manipuri Colony, Saroor Nagar, Hyderabad-35.
**4. Sri. K. Mahesh,** S/o. K. Yadagiri, Aged about Major, R/o. H.No. Plot.No.78, Sri Vidya Town Ship, Opp: Bachpan School, Badangpet, Hyderabad.
**5. Sri. P. Srinivas Rao,** S/o. P. Mallaiah, Aged about Major, R/o. H.No. 10-3-444/89, VN Colony, PS Nagar, Vijayanagar Colony, Hyderabad-28. **...OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.3,06,652/-.** The above claim petition is posted to dated **08-07-2025** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00 A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**Smt. B. Sandhya Naga Padma, Advocate,**
H.No.8-3-115/A & B, L.B. Towers, Keshava Nagar, Srinagar Colony Road, Hyderabad-500 163

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR, AT ERRAGADDA, HYDERABAD (SOUTH).**
**DISPUTE NO. GL004 OF 2025**

BETWEEN:
**M/S PMBS CHIT FUND PRIVATE LIMITED. ...Disputant**
Vs.
**Mr. B. Veneswar Rao & Others ...Opponents**

**1. Sri. B. Veneswar Rao,** S/o Late Mallikarjun Rao, R/o H.No. 11-1-1282, Aghapura, Afzal Sagar, Komali Kunta, VTC, Hyderabad-500001.
**2. Sri M. Madhu,** S/o M. Venkat Ram, R/o H.no.14-2-235/A, Ghode Ki Khabar, Hari Nagar, Nampally, Hyderabad-500012.
**...OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.2,77,487/-.** The above claim petition is posted to dated **08-07-2025** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00 A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**Smt. B. Sandhya Naga Padma, Advocate,**
H.No.8-3-115/A & B, L.B. Towers, Keshava Nagar, Srinagar Colony Road, Hyderabad-500 163

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR, AT ERRAGADDA, HYDERABAD (SOUTH).**
**DISPUTE NO. GL002 OF 2025**

BETWEEN:
**M/S PMBS CHIT FUND PRIVATE LIMITED. ...Disputant**
Vs.
**Mr. K. Surender Reddy & Others ...Opponents**

**1. Sri. K. Surender Reddy,** S/o. K. Madhava Reddy, Aged about Major, R/o. H.No.5-316, Chandra Nagar, Chintal, Quthbullapur, R.R District-55.
**2. Sri. M. Arjun Goud,** S/o. M. Lakshmi Narayana, Aged about Major, R/o. H.No.8-216/2, Prasoona Nagar, Near Chanakya High School, Chintal, Hyderabad-54.
**3. Sri. K. Chandrakanth,** S/o. K. Anantham, Aged about Major, R/o. H.No.48-527/4/1, Ganesh Nagar, Chintal, Quthbullapur, R.R.District-54. **....OPPONENTS**

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.82,715/-.** The above claim petition is posted to dated **08-07-2025** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at 12.00 A.M. On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**Smt. B. Sandhya Naga Padma, Advocate,**
H.No.8-3-115/A & B, L.B. Towers, Keshava Nagar, Srinagar Colony Road, Hyderabad-500 163

## ముసారాంబాగ్‌లో శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్
### -కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ, చిత్రంలో అధికారులు తదితరులు

**మలక్ పేట ,జూన్ 11, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ డివిజన్‌లో ముందస్తు వర్షాకాలం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ ని పురస్కరించుకుని డివిజన్ లో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఈనెల 25వ తేదీ వరకు మలక్ పేట్ నియోజకవర్గంలో కొనసాగుతుందని వివరించారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా డివిజన్ లోని ప్రతి ప్రాంతంలో, బస్తీలో, కాలనీలలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముమ్మరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. వ్యర్థాలు, చెట్ల కొమ్మలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా బక్రీద్ పండుగ సందర్భంగా నమోదైన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, సిబ్బంది రాజు, కళ్యాణ్, సూపర్వైజర్లు లు శ్రీను, సుభాష్, నర్సింగ్, స్థానికులు కొంగర ప్రవీణ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ఎండిఎ కమిషనర్‌ని కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి



హెచ్ఎండిఏ కమిషనర్‌ను కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి , మాజీ జెడ్పిటిసి మంద సంజీవరెడ్డి , దళిత సంఘం నాయకులు

**బోడుప్పల్ ,జూన్ 11 ప్రభాతవార్త ;** కమిషనర్ సర్ఫరాజ్ ఆహ్మద్ మాజీ మంత్రి , లీలిత మల్లారెడ్డి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దళితుల భూమీ సర్వే నెంబర్ 63/2 నుండి 63/25 లోని 336 భూమిని ల్యాండ్ పులింగ్ వెంటనే చేయాలని కోరడం జరిగింది. దళిత రైతులకు ఒక ఎకరంకు 600 గజాలు చొప్పున స్థలం వెంటనే అలాట్మెంట్ లెటర్ ఇవ్వాలని కోరడం జరిగింది. అందుకు వెంటనే స్పందించిన హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సంబంధంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి , అంబేద్కర్ సంఘము మాజీ అధ్యక్షులు మీసాల కృష్ణ , సిహెచ్ కుమార్, కే నర్సిహా, సంఘం జనరల్ సెక్రటరీ చంటి శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు ఉప్పరి విజయ్ పాల్గొన్నారు.

### అభ్యుదయ నగర్‌లో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న అభ్యుదయనగర్ కాలనీ ప్రతినిధులు.

**వనస్థలిపురం. జూన్.11.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అభ్యుదయనగర్ కాలనీలో రూ.92 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సి.సి.రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి బుధవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లో అన్ని కాలనీలలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు గంగిరెడ్డి, విజయకుమార్,సల్లవుద్దీన్, సీతారామరాజు,శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



**మల్కాజిగిరి జూన్11,ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గం మైనార్టీ నాయకులకు కుట్టు మిషన్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కుషాయిగూడ మైనార్టీ కార్యాలయంలో డివిజన్ కు 20 కుట్టు మిషన్ లో చొప్పున 9 డివిజన్లకు 180 కుట్టు మిషన్లు ముస్లిం మైనార్టీలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్ బాయ్,హమీద్ బాయ్ ,డివిజన్ అధ్యక్షుడు సయ్యద్.యూసుఫ్ బాయ్, సయ్యద్,మబ్బు, నయీం ఖాన్,ఫరీద్, ఎం డి అలీ, మైముద బేగం, ముబసీర్ బాయ్, షకీల్, ఇర్ఫాన్, ఇంతియాజ్, వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, పాండు చారి, ఆశా, మల్లేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు

### మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కమిటీ ఏర్పాటు

**ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** మన ఆలోచన సాధనా సమితి తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సమితి వ్యవస్థాపకుడు కటకం నర్సింగరావు తెలిపారు. బుధవారం నాగోలు మన ఆలోచన సాధనా సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా గడ్డం నరసింహగౌడ్, దింత ఆనందం, పూస నరసింహ, అధ్యక్షులుగా కటకం నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల దేవేందర్, తడక యాదగిరిపద్మశాలి గుండ్ల ఆంజనేయులుగౌడ్, గుండిపాటి వెంకట్‌పూసల, కొరంగి దుర్గారాణి రజక, క్యాతురు విద్యాసాగర్‌ముదిరాజ్, పంతంగి విట్టలయ్య గౌడ్, సత్యనారాయణచారి, సంఘం రాజేశ్వర్‌నేత, ఆమంచి అంజయ్యరజక, భరద్వాజ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బచ్చనబోయిన శ్రీనివాసులుయాదవ్, గోదా మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శులుగా గునిగంటి చంద్రశేఖర్‌గౌడ్, గౌటీ రమాదేవి, వట్టిపల్లి వెంకటేష్, పానుగంటి రవి, కృష్ణయ్య, ఎనబోలు శ్రీనివాస్, మాదం పద్మజాదేవి, పన్నీరు సత్యం, ఆలేటి యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నక్క కాశీనాథ్‌నేత, చుక్కల సత్యనారాయణ, ప్రచారకార్యదర్శులుగా పెద్దవూర బ్రహ్మయ్య, జక్కుల బాలరాజు, పెండెం లక్ష్మణ్, కొంపోజు నరహరి, శ్యామల యాదగిరి వంశరాజ్, అధికార ప్రతినిధులుగా సిలువేరు శంకర్, మంగిపల్లి శంకర్, ఆవుల వెంకట్‌యాదవ్, కోశాధికారులుగా నాంపల్లి రవి, వడ్డేపల్లి దశరథ్, మహంకాళి సదాశివుడు, యాదాల ప్రకాష్, మారగోని సత్యనారాయణ, చెరుకు స్వామి, మారోజు రా జు, గోదా లింగస్వామి, కస్తూరి అశోక్, చేను శ్రీనివాస్, శ్రీని వాస్, రమేష్, తీరం దాను రమేష్, గట్టు మొగిలయ్య, దశరథ, కేశవ్, కృష్ణ, శ్రీనివాస్ లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

## కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే పదవులు
### -స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనా రెడ్డి

**హుడా కాంప్లెక్స్, జూన్ 11, ప్రభాతవార్త:** కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే పదవులు వస్తాయి అని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ , బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ల, రామకృష్ణ పురం , సరూర్ నగర్ డివిజన్ ల ముఖ్య నాయకుల సమావేశం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, టిపిసిసి జనరల్ సెక్రటరీ ధారాసింగ్ ల ఆధ్వర్యంలో అశోక్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశాన్నీ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి లతో కలిసి వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలిఅని అన్నారు. కష్టకాలంలో జెండా మోసిన వారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. డివిజన్ అధ్యక్షులపై స్థానిక నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు.నిరంతరం ప్రజల మధ్య ఉండే వారికి గుర్తింపు, పదవులు ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సహా అధిష్టానం భావిస్తోందని కేఎల్ఆర్ అన్నారు. ఢిల్లీ, గాంధీభవన్ లో కూర్చొని పదవులు ఇవ్వకుండా.. అగ్రనేత రాహుల్ గాంధీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సీనియర్ నాయకులను అబ్జర్వర్స్ నియమించారని అన్నారు.ఈ కార్యక్రమంలో చిగురింత పారిజాత నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ యాదవ్,పున్న గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి,సామిడీ గోపాల్ రెడ్డి, పుట్టగల్ల జగన్, ధనరాజ్ గౌడ్, గట్ల రవీంద్ర,రమేష్ నేత, వెంకటేష్ గౌడ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్ ,కమిషనర్ త్రిలేశ్వరరావు , మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి జూన్ 11 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ అమర్ సింగ్ విచ్చేసి, ముగ్గు పోశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 హామీలలో ఒక్కొక్కటి గా అమలు చేస్తూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒక్కటి స్వర్గీయ ఇందిరా గాంధీ గరీబ్ హటావో గరీబ్ బచావో అనే నినాదంతో ప్రతి గ్రామంలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదు అనే ఉద్దేశంతో ఇందిరా గాంధీ భారతదేశంలో ప్రతి గ్రామంలో ఎన్నోఇండ్లు ఇచ్చిన విషయం అందరికి తెలిసినదే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుపేదకు ఇండ్లు ఇవ్వడం చాలసంతోషంగా ఉందన్నారు.వచ్చే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వని మరింత బలపరచాలని అన్నారు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత వరకు అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్దిచేకూరుతుంది,మొదటి విడత లో పేరు రాని వారు అధైర్యాపడవద్దు తరువాత రెండవ విడతలో మరిన్ని ఇండ్లు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిల్లేశ్వరరావు ,మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి , మాజీ కార్పొరేటర్లు బోడిగే స్వాతి కృష్ణ గౌడ్ ,పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యులు చిలుమల జగదీశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, చింతల నరసింహా రెడ్డి,కాంగ్రెస్ కార్యకర్తలు , ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ,తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సత్యనారాయణ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న చైర్మన్ లింగారెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ లలితనగర్ కాలనీలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ లింగారెడ్డి తెలిపారు. ఆరు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పత్రికను బుధవారం దేవాలయం ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ గురువారం శత ఘట్టాభిషేకం, 108 వెండి కలశాలతో 108 మంది దంపతులతో జైష్ఠాభిషేకం, పుష్పాభిషేకం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, 13వ తేదీన యాగ శాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, గరుడ ఇష్టి హోమము, ధజారోహణము, సౌందర్య లహరి, 14వ తేదీన మూలమంత్ర ఆహ్వానములు, అలంకరణ, సుదర్శన ఇష్టి, హోమము, 15వ తేదీన శ్రీ లక్ష్మీ నారాయణ ఇష్టి హోమము, శ్రీరమా సహిత శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి వారి కళ్యాణ మహోత్సవము, 16వ తేదీన మూల మంత్ర హోమము, పూర్ణాహుతి, శ్రీ రమా సహిత శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతము, నిత్య హోమము, శేష వాహనము, రథోత్సవము, 17వ తేదీన మహా పూర్ణాహుతి, 108 వెండి కలశాలతో స్వామివారికి అభిషేకము తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

### పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి



ప్రదర్శనలో పాల్గొన్న రాధా ధీరజ్ రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు రాబోవు వర్షాకాలంలో ప్రజారోగ్యము పారిశుద్ధ్య విషయమై ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలనే ఆదేశాల మేరకు బుధవారం ఆర్కే పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్ నెంబర్ 20 లో కార్పొరేటర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా హరిపురి కాలనీ, సాగర్ హిల్స్, యాదవ నగర్, ఈస్ట్ యాదవ నగర్, కాలనీ మార్గదర్శి కాలనీ, ద్వారకా నగర్ కాలనీ, సౌభాగ్యపురం ఇందిరానగర్ కాలనీలలో రోడ్లను శుభ్రం చేయడంతో పాటు పారిశుద్ధ నిర్వహణలో అందరు భాగస్వాములు కావాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి నుండి వ్యాపార స్థలాల నుండి వెలువడే చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా జిహెచ్ఎం సి స్వచ్ఛఆటో వారికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం డిఈ చందన చౌహాన్, బుచ్చయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వారిపై కేసునమోదు

**హయత్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి చాక్లెట్‌లను అక్రమంగా విక్రయిస్తున్న దుకాణంపై దాడి చేసి దుకాణ యజమానితో పాటు గంజాయి చాక్లెట్లు అమ్మడానికి వచ్చిన వ్యక్తి పై హయత్ నగర్ పోలీసులు కేసునమోదు చేశారు. వివరాలు... కుంట్లూరు రోడ్ లోని దుర్గాభవాని ట్రేడర్స్ లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి చాకోలెట్లు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం హయత్నగర్ పోలీసులు సదరు దుకాణం మీద దాడి చేసి 10 ప్యాకెట్ల గంజాయి చాకోలెట్లు, 40 వేల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని శేఖర్ తో పాటు గంజాయి చాక్లెట్స్ అమ్మడానికి వచ్చిన రిషి రిషి శంకర్ మిత్రులపైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డ్రైనేజీల్లో పూడికలను తీయిస్తున్న మీర్‌పేట్ కమీషనర్ జ్ఞానేశ్వర్

### కెసిఆర్‌కు మద్దతుగా తరలిన బిఆర్ఎస్ నేతలు



బూర్గుల రామకృష్ణారావు వద్ద నిరసన కార్యక్రమంలో సూర్ణగంటి అర్జున్, రామిడి రాంరెడ్డి, కామేష్‌రెడ్డి, సిద్దాల బీరప్ప తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** కాళేశ్వరంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారణకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సంఘీభావంగా మహేశ్వరం నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్‌కు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపు మేరకు మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీతో పాటు వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు విచారణ జరిగిన నగరంలోని సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు భవన్ వద్దకు వెళ్లారు. అక్కడ వారు సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి కార్తీక్‌రెడ్డితో కలిసి ఆందోళన చేశారు. కాళేశ్వరంపై విచారణ పేరుతో కెసిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధించే ప్రయత్నాలు చేస్తున్నందుకు నిరసనగా వారు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్, మీర్‌పేట్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్లు సూర్ణగంటి అర్జున్, అర్కల భూపాల్‌రెడ్డి, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, ఏనుగు రాంరెడ్డి, నాయకులు జె. శ్రీనివాస్ నాయక్, దిండు భూపేష్‌గౌడ్, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, ఎంఎ రజాక్, జగాల్‌రెడ్డి, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వర్‌చారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



కాళేశ్వరం విచారణ సందర్భంగా మాజీ కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు మద్దతుగా బి ఆర్ కే భవన్ కు కార్పొరేటర్లు,బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తరలివెళ్లిన దృశ్యం

## మంత్రి చేసిన శంకుస్థాపనలకు తిరిగి శంకుస్థాపనలా : చింతల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతల రవికుమార్, కిషోర్

**వనస్థలిపురం మే.11.ప్రభాతవార్త :** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో కొందరు కార్పొరేటర్లు ఒకసారి మంత్రి చేసిన శంఖుస్థాపన లకు తిరిగి మరోసారి శంఖుస్థాపనలు చేయడం చూస్తుంటే విడ్డురంగా ఉందని వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు చింతల రవికుమార్ పేర్కొన్నారు. వనస్థలిపురం లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మంత్రి శ్రీధర్ బాబు ఆయా డివిజన్ల కార్పొరేటర్ లతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన లు చేశారు.వివిధ కాలనీలకు సంబంధించిన అభివృద్ధి పనులు లకు ఒకేచోట శంకుస్థాపన లు చేయడం జరుగిందన్నారు.అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా కొందరు కార్పొరేటర్లు మంత్రి చేసిన శంఖుస్థాపన లకు తిరిగి ఆయా కాలనీలలో శంఖుస్థాపన నలు చేయడం చిల్లర రాజకీయాల కు తెరలేపినట్లే నని ఆరోపించారు. ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హుందాగా వ్యవరిస్తూ,నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిషోర్ పాల్గొన్నారు.

### స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పున: ప్రారంభం



ఎస్ ఎన్ డి పి ప్రారంభోత్సవంలో మాజీ మేయర్ అమర్ సింగ్,పప్పుల అంజిరెడ్డి, బోడిగే కృష్ణ గౌడ్ ,తదితరులు

**మేడిపల్లి ,జూన్ 11 ప్రభాతవార్త ;** వర్షాకాలంలో నీటి నిల్వలు, వరదలు వంటి సమస్యలతో బాధపడుతున్న తక్కువ భూమి ఉన్న ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట కలిగించే విధంగా, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారికంగా మళ్లీ పున: ప్రారంభించారు. ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల కొరత కారణంగా ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయం లభించడంతో ఎస్ ఎన్ డి పి కు కొత్త ఊపొచ్చింది.మేడ్చల్ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ మద్దతు వల్ల ఈ ప్రాజెక్ట్ పునఃప్రారంభం సాధ్యమైంది. ఈ ప్రాజెక్ట్‌ను తిరిగి ప్రారంభించడంలో పీర్జాదిగూడ మునిసిపల్ కమిషనర్ పాత్ర విశేషమైనది. ఈ ముందడుగు కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను అమలుచేస్తున్న తీరుని ప్రతిబింబిస్తుంది.మాజీ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి , మాజీ కార్పొరేటర్లు పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి , బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడిగా సుధేష్ కుమార్



సుధేష్ కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్

**సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా బి.వై.సుధేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సుధేష్ కుమార్ మాట్లాడుతూ హైద్రాబాద్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎస్‌సి సెల్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ హైద్రాబాద్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధర్మకర్త ఎనుముల రవీందర్ రెడ్డి, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

**సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, నారాయణ దుర్గారెడ్డి, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగం శెట్టి శ్రీనివాస్, కుకునూరి గోపాల్ రెడ్డి, కె.కవిత, ఒరుగంటి నరేష్, కొండ్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



ముందస్తు భద్రతా చర్యలో భాగంగా మలక్ పేట్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ తీగల అజిత్ రెడ్డి, ముసారాంబాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లారి రఘునందన్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్న మలక్ పేట పోలీసులు (మలక్ పేట ప్రభాతవార్త)

### నాదర్‌గుల్ లింగమయ్య జాతర విజయవంతానికి సహకరించిన కెఎల్ఆర్‌కు సన్మానం



కెఎల్ఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి జ్ఞాపికను అందజేస్తున్న నాదర్‌గుల్ యాదవ సంఘం ప్రతినిధులు

**సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో ఇటీవల జరిగిన లింగమయ్యగుట్ట జాతర మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని ఉత్సవ నిర్వాహకులైన యాదవ సంఘం నాయకులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తుక్కుగూడలోని నియోజకవర్గ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన నాదర్‌గుల్ యాదవ ప్రతినిధులు కెఎల్ఆర్‌ను కలిసారు. ఇటీవల జరిపిన లింగస్వామి కళ్యోణోత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగంతో పనులు చేయించి సహకరించినందుకు కెఎల్ఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు ఆయనను శాలువాతో సన్మానించి ఉత్సవాలకు సంబంధించిన జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, శివసేనారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నాదర్ గుల్ మాజీ ఎంపిటిసి తర్రె మల్లేష్ యాదవ్, జెనిగె మల్లేష్ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు : చల్లా నర్సింహారెడ్డి



ఏనుగు జంగారెడ్డిని సన్మానిస్తున్న టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి: చిత్రంలో కెఎల్ఆర్, శివసేనారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌లో అంకిత భావంతో పని చేసే వారిని పార్టీ అధిష్టానవర్గం గుర్తించి తప్పక న్యాయం చేస్తుందని టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని సీనియర్ నాయకుల్లో ఒకరైన కందుకూరు మాజీ జడ్పీటిసి, రంగారెడ్డి జిల్లా పరిషత్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డిని పార్టీ అధిష్టానవర్గంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఆయనకు చల్లా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇం ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ శివసేనారెడ్డి సమక్షంలో శాలువాతో సన్మానించి అభినందించారు.

### ముమ్మరంగా వంద రోజుల కార్యాచరణ కార్యక్రమాలు



పారిశుధ్య పనులు చేయిస్తున్న బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతి

**సరూర్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కమీషనర్ పి.సరస్వతి అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్ప, పోచమ్మ కుంట, బాలాపూర్ సిఎన్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త రిక్షాల సిబ్బందికి ఇవ్వడంపై అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య పనులు చేయించి టాయిలెట్లను శుభ్రం చేయించారు. 15వ డివిజన్‌లో నాలాలను కూడా శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమీషనర్ శ్యామ్ సుందర్, డిఇఇ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్ రావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మౌనిక, మెప్మా శంకర్, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్‌పిలు, స్వయం సహాయక గ్రూపు మహిళలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ కమాన్ నుంచి జీవన్‌జ్యోతి సంఘం వరకు రూ.19లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, బిజెపి నాయకులు సూరజ్, కోళ్లగోపి, జగన్నాథం, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముందస్తు భద్రత చర్యలలో భాగంగా ఓల్డ్ మలక్ పేట్ శంకర్ నగర్ లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ ను అదుపులోకి తీసుకున్న చాదర్ ఘాట్ పోలీసులు (మలక్ పేట ,ప్రభాతవార్త)